క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన శ్రీనివాసన్



శ్రీనివాసన్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో) : పారిశుధ్యం, ఓడీఎఫ్, ఎస్‌డబ్ల్యూ పీసీ రిసోర్స్‌పర్సన్ శ్రీనివాసన్ జిల్లాలో పర్యటనలో భాగంగా శుక్రవారం భీమడోలులో పర్యటించారు. అనంతరం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. పారిశుధ్యం, ఓడీఎఫ్, తడిచెత్త, పొడి చెత్త నిర్వహణ అంశాలపై సమీక్షించారు. శ్రీనివాసన్‌ను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, డీఆర్‌ఓ ఏవీఎస్ఎన్ మూర్తి, డీపీఓ తూతిక విశ్వనాథ్ శ్రీనివాస్, డీఎల్‌డీఓ శిరీష ఉన్నారు.

నాయీబ్రాహ్మణుల వినతి



డీఆర్‌ఓకు వినతి పత్రం అందిస్తున్న నాయీబ్రాహ్మణులు

ఏలూరు (టూటౌన్): నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓలను అమలు చేయాలని కోరుతూ నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు శుక్రవారం డీఆర్‌ఓ ఏవీఎస్ మూర్తికి వినతి పత్రం అందజేశారు. దేవస్థానాల కమిటీల్లో నాయీబ్రాహ్మణులకు స్థానం, నాయీబ్రాహ్మణ కుల దూషణ క్రింద ఇచ్చిన జీఓలను వెంటనే అమలు చేయాలని కోరారు. 45 సంవత్సరాలు దాటిన ప్రతి నాయీబ్రాహ్మణుడికీ పెన్షన్ మంజూరు చేయాలని, ప్రతి బార్బర్ షాప్‌కి 150 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్య, ఉద్యోగ రంగాల్లో ఉన్న రిజర్వేషన్ మాదిరి రాజకీయం, స్థానిక సంస్థల్లోనూ ఏబీసీడీ వర్గీకరణ జరగాలన్నారు. కళాకారులకు వాయిద్య పరికరాలను ట్రాన్స్‌పోర్టు చేసుకునే విధంగా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నూజివీటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పెర్ల నాగరాజు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు కొప్పాక వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ నందిగం సుబ్బారావు, చెడే నాగరాజు, సీహెచ్ వీరభద్రరావు, ఉదవల్లి కిషోర్, పట్నాల వీరాస్వామి, నరం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



విశేష అలంకరణలో సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి



సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు చేస్తున్న మహిళలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రావణమాసం మొదటి శుక్రవారం పర్వదినం సందర్భంగా నగరంలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవార్లకు విశేష అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం లలితా సహస్ర నామ పారాయణలు, మణిద్వీప వర్ణన పారాయణలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు విశేష అలంకరణలు చేశారు. సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. మధ్యాహ్నం అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతులు ఇచ్చి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఆలయ అర్చకుడు వారణాశి శ్రీ రాఘవేంద్ర శర్మ విశేష పూజలు చేయగా, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఎంపీ కోటగిరి శ్రీధర్



శ్రీకృష్ణ జన్మాష్టమి కరపత్రం విడుదల చేసిన ఎంపీ కోటగిరి శ్రీధర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ తమ ఇష్టదైవాలను పూజించడం ద్వారా సమాజంలో శాంతిసామరస్యాలు నెలకొల్పవచ్చని ఏలూరు పార్లమెంట్ సభ్యుడు కోటగిరి శ్రీధర్ అన్నారు. ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెల 7న నిర్వహించే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల కరపత్రాన్ని శుక్రవారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ ఇస్కాన్ సంస్థ నిర్వహిస్తోన్న ఆధ్యాత్మిక సేవలు అభినందనీయమని అన్నారు. ఇస్కాన్ సంస్థ ఏలూరు శాఖ అధ్యక్షుడు రాధావల్లభ దాస్ మాట్లాడుతూ సెప్టెంబర్ 7న తమ సంస్థ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. స్థానిక శాంతినగర్లోని రాజరాజేశ్వరి కళ్యాణ మండపంలో నిర్వహించే ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులకు శ్రీకృష్ణ వేషధారణ పోటీలు సంధ్యా మారతి, పుష్పాభిషేకం, మమా శంఖాభిషేకం నిర్వహించనున్నామని తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. సెప్టెంబర్ 8న ఇస్కాన్ సంస్థ వ్యవస్థాపకాచార్యులు శ్రీల ప్రభుపాదుల ఆవిర్భావ సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి పుష్పాభిషేకం, ఆధ్యాత్మిక ప్రవచనం, అనంతరం అన్న సమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న గుడిపాటి నరసింహారావు

ఏలూరు (టూటౌన్): నేతాజీ సుభాష్ చంద్ర బోస్ చూపిన విధంగా దేశభక్తిని పెంపొందించుకోవాలని ఏపీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ 78వ వర్ధంతి సందర్భంగా స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బోస్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుడిపాటి మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా వచ్చిన స్వాతంత్ర్యం మన అందరికీ సంపూర్ణంగా దక్కాలని అన్నారు. సుభాష్ చంద్రబోస్ ఒక ఐసీఎస్ ఆఫీసర్‌గా అర్హత కలిగినప్పటికీ దేశం కోసం పోరాటబాట పట్టారన్నారు. ఆయన ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఆజాద్ హింద్ ఫౌజ్) నెలకొల్పి సైనికంగా పోరు సాగించారని గుర్తుచేశారు. అన్ని మతాలు, ప్రాంతాల సైనికులను ఐక్యం చేయుటకు సుభాష్ చంద్రబోస్ ఇచ్చిన జైహింద్ నినాదం గొప్ప ప్రేరణ కలిగించే నినాదమని, ఆ నినాదం రూపొందిన తీరును వివరించారు. కార్యక్రమంలో ఎం.లక్ష్మి, బి.త్రినాథ్, ఎస్.సురేష్, జి.సుకుమార్, కె.గౌతం, ఎస్.నవదుర్గ, పి.నీలిమ, వై.సరోజ, వివిధ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.

మెడికల్ సీట్లు కన్వీనర్ కోటాలోనే భర్తీ చేయాలి

ఏలూరు (టూటౌన్): ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించే మెడికల్ కాలేజీల్లో వంద శాతం సీట్లను కన్వీనర్ కోటాలోనే భర్తీ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని కోరారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్లో శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు యం.క్రాంతి, నగర ప్రధాన కార్యదర్శి ఎం.జానకీరామ్, నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో బస్సు యాత్ర



పోస్టర్ విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు (టూటౌన్): సీపీఐ బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు డేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య కోరారు. పార్టీ స్థానిక కార్యాలయంలో శుక్రవారం బస్సు యాత్ర వాల్ పోస్టర్‌ను వారు విడుదల చేశారు. ఈనెల 17న విశాఖ పట్టణంలో ప్రారంభమైన బస్సు యాత్ర 23, 34 తేదీల్లో ఏలూరు జిల్లాలో కొనసాగుతుందని వారు చెప్పారు. ఈ నెల 23న ఉదయం ఏలూరు టుబాకో కల్యాణ మండపంలో పోలవరం సమస్యపై రౌండ్ టేబుల్ సమావేశం, సాయంత్రం జంగారెడ్డిగూడెంలో పోలవరం నిర్వాసితుల సమస్యపై చర్చ ఉంటుందని తెలిపారు. ఈనెల 24న నూజివీడులో భూ సదస్సు నిర్వహిస్తామన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేసిందని తెలిపారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం మతోన్మాద చర్యలకు పాల్పడుతుందన్నారు. కార్యక్రమంలో బండి వెంకటేశ్వరరావు, రెడ్డి శ్రీనివాస డాంగే, కె.కృష్ణమాచార్యులు, పుప్పాల కన్నబాబు, కడుపు కన్నయ్య, గేదెల నాగేశ్వరరావు, యర్రా వెంకటేశ్వర్లు, కనకం జగన్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు గడువును పొడిగించినట్లు సీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, ఓపెన్ యూనివర్సిటీ రీజనల్ కోఆర్డినేటర్ వీఏఎస్ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గడువు తేదీని సెప్టెంబర్ 5 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 20 వరకు రూ.100 అపరాధ రుసుముతో, సెప్టెంబర్ 30 వరకు రూ.200 అపరాధ రుసుముతో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు కూడా ఆయా తేదీల్లో ఫీజులు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

హోంగార్డుల సంక్షేమానికి ప్రాధాన్యత



హరిబాబుకు చెక్కు అందిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలోని హోంగార్డుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ఉత్తమ సేవలు అందిస్తోన్న ప్రతి సిబ్బందికీ తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో పదవీవిరమణ చేసిన హోంగార్డు కె.హరిబాబుకు శాఖ తరఫున రావాల్సిన రూ.5,44,570 చెక్కు రూపంలో ఎస్పీ మేరీ ప్రశాంతి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	48	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	07-10
బెండకాయలు	24	కంద	36
పచ్చిమిర్చి	50-60	బీట్‌రూట్	36
కాకర కాయలు	50-56	కీరా దోస	40
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	72
బీరకాయలు (పందిరి)	48	అల్లం	120-220
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	36	పాలకూర	10
దొండకాయలు	32	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	30	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	30 - 46	బజాజీ	--
ఆనపకాయ (1)	10-15	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20-30	చిలకడదుంప	40

మండల పరిషత్‌కు మట్టి కలశాలు



గ్రామాల నుంచి మండల పరిషత్ కార్యాలయానికి చేరిన కలశాలు

ఏలూరు రూరల్: ఏలూరు మండల పరిషత్ కార్యాలయానికి మన భూమి, మన దేశం కలశాలు శుక్రవారం చేరాయి. మండలంలో 15 పంచాయతీలు, సచివాలయ కార్యదర్శులు ఆయా గ్రామాల మట్టితో నింపిన కలశాలను మండల పరిషత్ కార్యాలయానికి తీసుకొచ్చి ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.సుజాతకు అప్పగించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ కలశాలలను ఢిల్లీకి పంపిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా మండలం నుంచి ఒక యువ కార్యకర్తను నియమిస్తారని తెలిసింది. గతవారం ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజుతో పాటు అధికారులు 15 గ్రామ పంచాయతీల్లో నా భూమి, నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో కలిసి నా భూమి, నాదేశం స్తూపాలను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుని నివాళులర్పించారు. కార్యక్రమానికి గుర్తుగా ఆయా ప్రాంతాల్లో మొక్కలు నాటారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



పాఠశాలలో మొక్క నాటుతున్న లయన్స్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని ఏలూరు సెంట్రల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ సూచించారు. ఏలూరు సెంట్రల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నా మొక్క... నా శ్వాస నినాదంతో శుక్రవారం ఏలూరు పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. విద్యార్థులతోనే పాఠశాల ఆవరణల్లో మొక్కలు నాటించినట్టు ఎడ్వర్డ్ తెలిపారు. ఈ ఏడాది 50 వేల మొక్కలు పంపిణీ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ కోఆర్డినేటర్ సీహెచ్ అవినాష్ రాజు, ఏఎంఎం రావు, ఇంటి నిర్మల, సి.గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	18
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	28
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	16
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	29
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	13
ఏలూరు -బీహెచ్ఈఎల్	08.00	4794	రద్దు
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	18
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	రద్దు
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

నేరాల అదుపునకు సహకరించండి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ శివాజీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నేరాలకు అడ్డుకట్టకి సహకరించాలని త్రీ టౌన్ సీఐ కోమాకుల శివాజీ కోరారు. ఏలూరు త్రీ టౌన్ పరిధిలో కళాశాల సమీపంలో విద్యార్థులను తరలించే ఆటో డ్రైవర్లతో ఆయన శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగరంలో కళాశాలల సమీపంలో ఆకతాయిలు విద్యార్థినులను ఈవ్ టీజింగ్ చేసే ప్రక్రియకు చరమగీతం పాడేందుకు ఆటో డ్రైవర్లతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. విద్యార్థులను ఆటో డ్రైవర్లు తరలించే సమయంలో ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు గురిచేస్తే వెంటనే మూడో పట్టణ సీఐ ఫోన్ నెంబర్ లేదా డయల్ 100కు తెలియజేయాలని కోరారు. ఆటోల్లో విద్యార్థులను స్కూలుకు తీసుకొచ్చే, తీసుకెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మూడో పట్టణ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు పత్తేబాద ప్రాంతంలో పేకాట శిబిరంపై టూటౌన్ పోలీసులు దాడిచేశారు. పత్తేబాద ప్రాంతంలో పేకాట ఆడుతోన్న ఏడుగురిని అరెస్టు చేసి, వారినుంచి రూ.10,600 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై పి.నాగబాబు తెలిపారు.

యువతులకు కౌన్సెలింగ్



పోలీసుల అదుపులో ఉన్న యువతులు, మహిళలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నగరంలో భిక్షటన చేస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న కొందరు యువతులు, మహిళలకు ఏలూరు త్రీ టౌన్ సీఐ కోమకుల శివాజీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఆర్ పేట, నగరంలోని పరిసర ప్రాంతాల్లో గుజరాత్ ప్రాంతం నుంచి వచ్చిన కొందరు యువతులు, మహిళలు వాహనదారులు, ప్రజలను అడ్డగిస్తూ డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్ చేయడంతో స్థానికులు త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మహిళలను అదుపులో తీసుకుని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ నుంచి వచ్చినట్టుగా గుర్తించిన సీఐ శివాజీ వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రత్యేకంగా ఆటోలో ఎక్కించి ఏలూరు రైల్వే స్టేషన్‌కు పంపించి స్వగ్రామాలకు వెళ్లేలా చర్యలు చేపట్టారు.